# రాజకీయల్లోకి వారసుడి అడుగు!




# నవతరం

తెలుగు దినపత్రిక

RNI NO. APTEL/2014/58326

సంపుటి : -13 సంచిక : 84 ఎడిషన్ ఇన్‌ఛార్జ్ : నవచైతన్య శిరిగిరి

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం రాజమండ్రి

24-01-2026 శనివారం వెల : 1/- పేజీలు : 4




- అరసవల్లిలో పరోక్ష ప్రకటన
- ఉత్సాహంలో గుండ అభిమానులు
- నీతి రాజకీయాలకు కొనసాగింపు.. గుండ వారసుడి రాకకు సంకేతాలు
- 'అన్నయ్య బాటలోనే నడుస్తా'
- రాజకీయాల్లోకి వస్తానంటూ గుండ విశ్వనాథ్ స్పష్టం
- గ్రామస్థులే అండగా నిలవాలంటూ గుండ తనయుల పిలుపు
- విగ్రహ ఆవిష్కరణ వేదికగా వెలువడిన కీలక వ్యాఖ్యలు
- పార్టీకి కట్టుబాటే గుండ ప్రత్యేకత
- అవసరానికి పార్టీలు మారని రాజకీయ సంస్కృతి
- భవిష్యత్ రాజకీయాలపై ఆశాభావం
- గుండ వారసుడిపై ప్రజల్లో పెరుగుతున్న నమ్మకం

(నవతరం ప్రతినిధి శ్రీకాకుళం)

ఒకే పార్టీపై నమ్మకంతో, పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేస్తూ, ప్రజాసేవనే పరమావధిగా భావించి రాజకీయ జీవితం కొనసాగించిన మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ ప్రజల హృదయాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. నీతి, నిజాయితీలకు చిరునామాగా నిలిచిన ఆయన ఇటీవల కాలంలో కన్నుమూయడంతో జిల్లా అంతటా శోకసంద్రం నెలకొంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఆయనకు ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించింది.
ఈ క్రమంలో అరసవల్లిలో గ్రామస్థులు తమ అభిమాన నాయకుడు గుండ అప్పలసూర్యనారాయణ విగ్రహాన్ని ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో గుండ తనయుల నుంచి పరోక్షంగా రాజకీయాల్లోకి అడుగుపెట్టే సంకేతాలు వెలువడటంతో అక్కడున్న ప్రజలు హర్షధ్వానాలు చేశారు.

## వారసత్వ రాజకీయాలకు ప్రజల మద్దతు

ఈ విషయం అక్కడి వారికే కాకుండా ప్రజల్లో శరవేగంగా వ్యాపించడంతో, గుండ తనయులు రాజకీయాల్లోకి రావాలంటూ జిల్లా వ్యాప్తంగా అభిమానులు బలంగా కోరుకుంటున్నారు. గత ఎన్నికల సమయంలోనే ఈ అడుగు పడివుంటే ఎంతో బాగుండేదని కొందరు అభిప్రాయపడుతూ, ఆ అవకాశం చేజారిపోయిందన్న ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
గుండ మరణానంతరం ఆయన వారసులు రాజకీయాల్లోకి వస్తారా లేదా అన్న సందేహాలు చాలామందిలో నెలకొనగా, ఆ సందేహాలకు తెరదించుతూ గుండ అప్పలసూర్యనారాయణ కుటుంబ సభ్యులు స్పష్టత ఇచ్చారు. తన తమ్ముడు స్వగ్రామానికి వస్తారని, గతంలో మాదిరిగానే అమ్మను, తమ్ముడిని అందరూ ఆదరించాలని గుండ పెద్ద తనయుడు గంగాధర్ విజ్ఞప్తి చేశారు.

## అన్నయ్య బాటలోనే నడుస్తా:గుండ విశ్వనాథ్

గుండ గంగాధర్ తమ్ముడు విశ్వనాథ్ మాట్లాడుతూ, తాను అరసవల్లికి వచ్చేస్తున్నానని, అన్నయ్య చూపిన మార్గంలోనే నడుస్తానని స్పష్టం చేశారు. గుండ తనయులు వెల్లడించిన ఈ విషయాలను స్థానికులు మాత్రమే కాకుండా గుండ అభిమానులు సైతం "చెవులకు మంచి వార్త"గా అభివర్ణిస్తూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## టీడీపీ వేదికపై ఆసక్తికర వ్యాఖ్యలు

ఇటీవల టీడీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన గుండ సంస్మరణ సభలో ఎమ్మెల్యే గొండు శంకర్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీశాయి. గుండ వారసులు రాజకీయాల్లోకి వస్తే తాను తప్పుకొని పార్టీకి సేవ చేస్తానని, అవసరమైతే టీ కప్పులు కడుగుతానని చేసిన వ్యాఖ్యలు అందరిలో ఆసక్తిని రేకెత్తించాయి. అయితే ఈ వ్యాఖ్యలను పూర్తిగా నమ్మేవారు మాత్రం తక్కువగానే ఉన్నారు.

## మీడియాలో ప్రముఖంగా వార్త

ఇదిలా ఉండగా, గుండ వారసులు ప్రత్యక్ష రాజకీయాల్లోకి వస్తున్నారన్న వార్త ప్రధానంగా అన్ని పత్రికల్లో ప్రముఖంగా ప్రచురితమవుతోంది. ఎమ్మెల్యే వ్యాఖ్యల్లో ఏమైనా అంతర్ముఖ అర్థం ఉందా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నప్పటికీ, అసలు నిర్ణయం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు, పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ల మనసుల్లో ఏముందన్నదే కీలకంగా మారింది.

## పార్టీకి కట్టుబాటే గుండ ప్రత్యేకత

గత ఎన్నికల్లో ప్రజాభీష్టానికి భిన్నంగా నిర్ణయం తీసుకున్నప్పటికీ, ఆ నిర్ణయానికి గుండ దంపతులు కట్టుబడి పార్టీ సిద్ధాంతాలను గౌరవిస్తూ మౌనంగా నిలిచిన తీరు రాజకీయ వర్గాల్లో ప్రశంసలు పొందింది. ఆ సమయంలో శ్రీకాకుళం ఎమ్మెల్యే అభ్యర్థికి ప్రజలు భారీ మెజారిటీ ఇచ్చారు.
అవసరానికి పార్టీలు మారే రాజకీయాలకు భిన్నంగా, అవసరమైనప్పుడు ఇబ్బంది కలిగించే లక్షణాలు లేని నాయకుడిగా గుండ అప్పలసూర్యనారాయణను ప్రజలు ఆదరించారు. అదే ఆదరణ ఆయన వారసులకు కూడా లభిస్తుందన్న నమ్మకం మెజారిటీ ప్రజల్లో ఉంది.

## భవిష్యత్ రాజకీయాలపై ఆశాభావం

ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో ఎప్పుడు ఎలాంటి నిర్ణయాలు వెలువడతాయో చెప్పలేని పరిస్థితి ఉన్నప్పటికీ, గుండ వారసుడు రాజకీయాల్లో రాణిస్తాడన్న ఆశాభావం మాత్రం ప్రజల్లో బలంగా కనిపిస్తోంది. భవిష్యత్ రాజకీయాలు ఏ మలుపు తిరుగుతాయో వేచి చూడాల్సిందే.

# వైభవంగా రథసప్తమి శోభాయాత్ర







- కళారూపాలతో పులకించిన నగర వీధులు 2లో
- ప్రారంభించిన మంత్రి అచ్చెన్నాయుడు దంపతులు

ఎడిటోరియల్

# విధ్వంసక దారి

కుల, మతాల తేడా లేకుండా స్నేహం, సౌభ్రాతృత్వం వెల్లివిరిసిన నేల మన భారతదేశం. ఐకమత్యమే మహాబలంగా మెలిగిన ఇక్కడి ప్రజల మధ్య పాలకుల ద్వేషపూరిత ప్రసంగాలు చిచ్చురేపుతున్నాయి. విద్వేషాన్ని విషంలా నింపేస్తూ, దేశాన్ని ఎంతలా నాశనం చేస్తున్నారో చెప్పడానికి 'ద ఇండియా హేట్? లాబ్? (ఐహెచ్?ఎల్?)' నివేదిక వెల్లడించిన వాస్తవాలు మన కండ్ల ముందున్నాయి. 2025లో ఈ ధోరణి బాగా ఎక్కువైందని నివేదిక స్పష్టం చేసింది. ఈ ఏడాది సైతం అంతే విద్వేషాన్ని వెల్లగక్కుతూ జాతీయ భద్రతా సలహాదారు అజిత్? డోవల్? యువతను రెచ్చగొట్టారు. జాతీయ భద్రతా సలహాదారుగా ఆయన దేశభద్రతా, దేశంలో శాంతి భద్రతలను కాపాడాల్సింది పోయిశాంతికి విఘాతం కలిగించే వ్యాఖ్యలు ఈ నివేదికను మరింత బలపరుస్తున్నాయి. ముస్లింలపై ప్రతీకారం తీర్చుకోవాలంటూ 'వికసిత్? భారత్? యంగ్? లీడర్స్? డైలాగ్?' కార్యక్రమం లో మూడువేల మంది యువ ప్రతినిధులకు అజిత్? డోవల్? విద్వేషాన్ని నూరిపోశారు. 'మొఘలులు గతంలో దేవాలయాలను లూటీ చేశారని, ధ్వంసం చేశారని, దానికి ఇప్పుడు ప్రతీకారం తీర్చుకోవాలని' అజిత్? డోవల్? యువతకు పిలుపునిచ్చారు.

అంతే కాదు 'భారత్? ఎన్నడూ ఇతర దేశాల మీద దాడి చేయలేదని, దేవాలయాలను, ఇతర ప్రార్థనా మందిరాలను ధ్వంసం చేయలేదు' అని కూడా ఆయన సెలవిచ్చారు. ఇది అర్ధ సత్యం మాత్రమే. కానీ హిందూ దేవాలయాలను హిందూ రాజులే ధ్వంసం చేసిన ఉదంతాలనేకం. 81 ఏండ్ల తన సుదీర్ఘ ప్రస్థానంలో సత్యం తెలుసుకునే అవకాశం ఆయనకు రాకపోవడానికి ఆయనను ఆవహించిన భావజాలమే కారణం. మన ఆలయాలను ధ్వంసం చేసిన వారి మీద ప్రతీకారం తీర్చుకోవాలని ఆయన అనడం దేశాన్ని అంతర్యుద్ధంలోకి నెట్టే ఆలోచన కాదా? ఆయన మాట్లాడుతున్న ఆలయ విధ్వంసకులు ఇప్పుడు ఎవరూ లేరు. అదంతా వందల ఏండ్ల నాటి చరిత్ర. కానీ 1992 డిసెంబర్? 6న బాబ్రీ మసీదును కూల్చివేసిందెవరు? హిందూత్వం తలకెక్కిన వారు కాదా? ఇది ఇటీవలి చరిత్రే కదా. ఈ వాస్తవం తెలియనంతటి జ్ఞానరాహిత్యం అజిత్? డోవల్? ఉందనుకోలేం. విద్యాధికుడైన డోవల్? వందల ఏండ్ల కింద జరిగిన సంఘటనలకు ఇప్పుడు ప్రతీకారం తీర్చుకోవాలని ఈ తరానికి కిర్రెక్కించడం యాదృచ్ఛికం అనుకుంటే పొరపాటే.

ఈ 21వ శతాబ్దంలో మతం పేరుతో ఎక్కడికి పోతున్నాం మనం! దేశం లౌకిక, సౌభ్రాతృత్వ దేశంగా ఉండాలని దేశ రాజ్యాంగం నిర్దేశిస్తున్నది. దేశ సమగ్రతను కాపాడుకోవాలని, భిన్న మతాలు, కులాలు, ప్రాంతాలు ఉన్న దేశాన్ని లౌకిక విలువలతో నిలుపుకోవాలని, అందుకు ప్రభుత్వా లు పూనుకోవాలన్న సుప్రీంకోర్టు వ్యాఖ్యలు ఇలాంటి నేతల చెవికి ఎప్పుడు ఎక్కుతాయో ఏమో. నిజానికి విశ్వాసాలను, భక్తిని, మతాన్ని ఆసరా చేసుకుని కొందరు ఆధిపత్య రాజకీయ ప్రయో జనాల కోసం వైరుధ్యాలను సృష్టించి, విద్వేషాలకు పాల్పడుతున్నారు. ఇది నేడు మనదేశంలో అత్యంత ప్రమాదస్థాయికి చేరుకున్నదనేది 'ఐహెచ్?ఎల్?' నివేదిక తేటతెల్లం చేసింది. 2025లో దేశంలో ముస్లిములు, క్రైస్తవులను లక్ష్యంగా చేసుకుని 1,318 విద్వేషపూరిత ప్రసంగాలు జరిగాయి. ఇది 2024 కంటే 13 శాతం అధికమని ఈ నివేదిక పేర్కొన్నది. ముస్లింల తర్వాత క్రైస్తవులు లక్ష్యంగానే ఈ విద్వేష ప్రసంగాలు చేసినట్టు 'ఐహెచ్?ఎల్?' వెల్లడించింది. బీజేపీ, ఎన్డీయే పాలిత రాష్ట్రాల్లో వీటి సంఖ్య ఘననీయం అని స్పష్టం చేసింది.

నేడు మతోన్మాదం 'జాతీయవాదం' ముసుగు తొడిగి కుప్పిగంతులు వేస్తున్నది. 'ఒక మాంత్రికుడు ద్వేషమనే పిశాచిని సృష్టించి పురిగొలిపితే, అది అన్నిటినీ తినొచ్చి, చివరాఖరుకు తన పుట్టుకకు కారణమైన మాంత్రికుడిని కూడా తిని తృప్తిపడిందట' అంటారు రచయిత దేవనూరు మహదేవ. సమాజాన్ని పురోగమనం వైపునకు నడిపించే అభ్యుదయ పురోగాములు ముందుకు రావాలి. సైద్ధాంతికంగా, శాస్త్రీయంగా ప్రశ్నించే పరిస్థితులున్న చోటనే కొత్త ఆలోచనలు పుడతాయి. ద్వేషం కాదు..దేశం ముఖ్యం. ఎండిన కడుపులు కాదొ పండిన భూములు ప్రధానం. ఉద్వేగాల భారతం కాదు..ఉద్యోగాల భారతం అవసరం. ఇలా సరికొత్త ఆలోచనలతో యువతను చైతన్యపరచాల్సిన నేతలు అందుకు పూర్తి విరుద్ధంగా విద్వేషపు విషాన్ని కక్కుతున్నారు. జాతీయ భద్రతా సలహాదారు స్థానంలో ఉన్న వ్యక్తి వందల ఏండ్ల నాటి అన్యాయాలకు ఇప్పటి ముస్లింలపై ప్రతీకారం తీర్చుకోవాలని యువతకు దిశానిర్దేశం చేయడం మొన్న మొన్నటిదాకా కాస్తోకూస్తో దృఢంగా ఉన్న మన లౌకిక పునాదులను పెకలించడమే. పదకొండేండ్లుగా మన పాలకులు వైవిధ్యభరితమైన మన భారతీయతను బలహీన పరుస్తూనే ఉన్నారనడానికి ఈ నివేదిక ఒక ఉదాహరణ. అజిత్? డోభల్? వ్యాఖ్యలు దీనికి కొనసాగింపే. ఈ తరాన్ని అదే విధ్వంసక దారిలో నడవమంటూ పిలుపునివ్వడమంటే కరడుగట్టిన విద్వేష రాజకీయాలను వారిపై రుద్దడమే.

# వైభవంగా రథసప్తమి శోభాయాత్ర



నవతరం -శ్రీకాకుళం

జిల్లా కేంద్రం భక్తిపారవశ్యంలో మునిగితేలింది. సూర్యనారాయణ స్వామి రథసప్తమి వేడుకలను పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రం నిర్వహించిన శోభాయాత్ర కనులపండువగా సాగింది. 55 రకాలకు పైగా జానపద, సాంప్రదాయ కళారూపాలు, వివిధ క్షేత్రాల దైవ శకటాలతో నగరం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. కె.ఆర్.స్టేడియం వద్ద రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తన ధర్మపత్నితో కలిసి స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే గొండు శంకర్ వెంట రాగా సాంప్రదాయ డప్పులు కొట్టి శోభాయాత్రను వైభవంగా ప్రారంభించారు.

శంఖారావాలు, మంగళవాయిద్యాల మధ్య సాగిన యాత్రలో సూర్యరథం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

సింహాచలం, అన్నవరం, కనకదుర్గమ్మ వంటి ప్రముఖ క్షేత్రాల నమూనా శకటాలు భక్తులను మంత్రముగ్ధులను చేశాయి. మహిళల కర్రసాము, అఘోరాల వేషధారణలు, కేరళ డ్రమ్స్, ధింసా నృత్యాలు యాత్రకు వన్నె తెచ్చాయి. డే అండ్ నైట్ జంక్షన్ నుంచి ఏడు రోడ్ల కూడలి, సూర్యమహల్, మిల్ జంక్షన్ మీదుగా అరసవల్లి ఆలయం వరకు సాగిన ఈ ప్రదర్శనను తిలకించేందుకు భక్తజనం పోటెత్తారు.

కార్యక్రమంలో అధికార యంత్రాంగం, భక్తులతో కలసి పాల్గొని కళాకారులను ఉత్సాహపరిచారు. యాత్ర ఆద్యంతం క్రమశిక్షణతో సాగేలా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ దొనక పృథ్విరాజ్ కుమార్ దగ్గరుండి పర్యవేక్షించారు. వీరితో పాటు డీఆర్డీఏ పీడీ కిరణ్ కుమార్, పోలీస్ ఉన్నతాధికారులు, ఇతర జిల్లా అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేశారు. యాత్ర పొడవునా భక్తులకు స్వచ్ఛంద సంస్థలు మంచినీరు, ప్రసాద వితరణ చేపట్టాయి. రాత్రి వేళ విద్యుత్ దీపాల కాంతుల్లో కళారూపాల ప్రదర్శనలు పండుగ వాతావరణాన్ని తలపించాయి.

# కాలం...దైవం కరుణిస్తేనే..?

కాలమే దైవమై
కరుణను చల్లితే,
అవకాశం తలుపు తడుతుంది
వరాల సిరుల వర్షం కురుస్తుంది

కష్టనష్టాలు కత్తులై ఎదురొచ్చినా...
అడ్డంకులు అవాంతరాలు
ముళ్లబాటల్ని సృష్టించినా...
ధైర్యమే కవచమై
కృషియే ఖడ్గమై
మనిషి ముందుకు నడిస్తే..

తుఫాన్ల మధ్య నౌకలా
పట్టుదల...దారి చూపుతుంది,
చీకట్లో చిరుదీపంలా
ఆరని ఆశ...దారిని వెలిగిస్తుంది.

శ్రమ చెమట విత్తనమైతే
విజయం...కల్పవృక్షమౌతుంది
కీర్తి పుష్పం...వికసించి ఖ్యాతి
పరిమళాలను వెదజల్లుతుంది

పంచభూతాలు తోడైతే...
ఎవరెస్టు శిఖరాలు
నీకు సెల్యూట్ చేస్తాయి
విజేతవై విశ్వ విజేతవై
ప్రపంచమంతా
నీ కీర్తి ప్రతిధ్వనిస్తుంది.

ఔను కనిపించని కాలమే
నీ చేతిలో వజ్రాయుధమైతే
కరుణించి ఆదైవం అనుగ్రహిస్తే
కృషి వుంటే మనుషులు
ఋషులౌతారన్నట్టు
అమృతత్వం, అమరత్వం
నీ జీవితానికే
చిరునామాలౌతాయి.



కవి రత్న
సాహిత్య ధీర,
సహస్ర కవి భూషణ్,
**పోలయ్య కూకట్లపల్లి,**
అత్తాపూర్, హైదరాబాద్

**రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆధ్వర్యంలో కోటబొమ్మాళి ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో రోగులకు పండ్లు, వస్త్రాలు పంపిణీ**

# ఘనంగా మంత్రి నారా లోకేష్ పుట్టినరోజు వేడుకలు





నవతరం కోటబొమ్మాళి

రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పుట్టినరోజు వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి.రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు గారి ఆధ్వర్యంలో కోటబొమ్మాళి ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో రోగులకు పండ్లు, వస్త్రాలు పంపిణీచేశారు. ఈ సందర్భంగా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు గారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ వారసత్వాన్ని గర్వంగా మోస్తూ, ఆధునిక రాజకీయాలకు కొత్త దిశ చూపుతున్న యువ నాయకుడు మంత్రి నారా లోకేష్ అని కొనియాడారు.పేరు కంటే పనితో తన రాజకీయ స్థానాన్ని సంపాదించుకున్న నాయకత్వం ఆయనది. విద్య, ఐటీ, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పన వంటి కీలక రంగాల్లో స్పష్టమైన దృష్టితో ముందుకు సాగుతూ, రాష్ట్ర భవిష్యత్తు నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు.

యువత ఆశయాలకు స్వరం ఇస్తూ, ప్రజలతో నేరుగా మమేకమయ్యే నాయకత్వం ఆయన ప్రత్యేకత. దూరదృష్టి గల నిర్ణయాలు, నిరంతర కృషి, బాధ్యతాయుత పాలన–ఇవే లోకేష్ గారి నాయకత్వానికి బలమైన పునాదులని పేర్కొన్నారు.రాజకీయాల్లో కొత్త తరం నమ్మకానికి, అభివృద్ధి ఆశయాలకు నిలువెత్తు ఉదాహరణగా నిలుస్తున్నారు.

రాష్ట్రాభివృద్ధికి మీ నాయకత్వం మరింత వెలుగులు నింపాలని ఆకాంక్షిస్తూ, రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ గారికి హృదయపూర్వక పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

కార్యక్రమంలో పిఎసిఎస్ మాజీ మంత్రి కింజరాపు హరివర ప్రసాద్ గారు, పెద్ద ఎత్తు తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# పోరాట బావుటా నేతాజీ

## గాంధీ మందిరంలో జయంతి వేడుకలు



నవతరం-శ్రీకాకుళం

భారత స్వాతంత్ర్య పోరాటంలో నేతాజీ సుభాష్?చంద్రబోస్ పోరాట బావుటా ఎగురవేసి ప్రపంచ దేశాల్లో ఎందరికో స్ఫూర్తిగా నిలిచారని వక్తలు పేర్కొన్నారు. ఆజాద్ హింద్ ఫౌజ్ స్థాపించి దేశం కోసం సైన్యాన్ని తయారు చేసిన వీరుడు నేతాజీ అన్నారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ 130వ జయంతి వేడుకలు శ్రీకాకుళం పట్టణంలోని గాంధీ మందిరం స్వాతంత్ర్య సమరయోధుల సృ?మతివనంలో శు క్రవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నేతాజీ విగ్రహదాతలు నక్క శంకరరావుతో పాటు మాజీ సైనికుల సంక్షేమ సంఘం ప్రతినిధులు జగ్గమ్మ, పద్మావతి, జామి భీమశంకర్, చౌదరి రాధాకృష్ణ, ప్రొఫెసర్ విష్ణుమూర్తి, బరాటం లక్ష్మణరావు తదితరులు మాట్లాడుతూ అత్యంత శక్తివంతమైన నేతగా సుభాష్?చంద్రబోస్ పనిచేశారన్నారు. 1947 దేశానికి స్వాతంత్ర్యం రాక మునుపే తన సైన్యంతో జాతీయ జెండా ఎగురవేసి స్వాతంత్ర్య భారతాన్ని ఆవిష్కరించిన ధీశాలి నేతాజీ అన్నారు. దేశం పట్ల అచెంచలమైన ప్రేమ కలిగిన దేశభక్తుడిగా ప్రజలందరి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. భావితరాలు దేశం కోసం నేతాజీ స్ఫూర్తిగా తీసుకొని పనిచేయాలని పేర్కొన్నారు. తొలుత గాంధీ మందిర కమిటీ ప్రతినిధులు నేతాజీ విగ్రహానికి పూల మాలలు వేశారు. ఈ సందర్భంగా పండితులు పైడి హరనాధరావు, నిష్టల నరసింహమూర్తి కలిసి నేతాజీ గొప్పతనాన్ని కీర్తిస్తూ గేయాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో గాంధీ మందిర బృందం ప్రతినిధులు వావిలపల్లి జగన్నాథం, తర్లాడ అప్పలనాయుడు, పొన్నాడ రవికుమార్, జి.నాగేశ్వరరావు, నిక్కు అప్పన్న, ఎం.వి.ఎస్.ఎస్.శాస్త్రి, బాలల హక్కుల పరిరక్షణ వేదిక కార్యదర్శి వి.మణిబాబు, బిజెపి రూరల్ అధ్యక్షుడు గొల్లంగి అసిరినాయుడు, సోషల్ మీడియా కన్వీనర్ బడే తాతారావు, యువమోర్చ నాయకులు డి.శేషగిరిరావు, తదితరులు పాల్గొన్నారు.

# విల్లుపురం జిల్లాలో... అభిరామేశ్వరర్ ఆలయం తమిళనాడు



అభిరామేశ్వరర్ ఆలయం, తిరువమాథూర్ ఆలయం అని కూడా పిలుస్తారు. దక్షిణ భారతదేశంలోని తమిళనాడు రాష్ట్రంలోని విల్లుపురం జిల్లాలో ఉన్న తిరువమాథూర్ అనే గ్రామంలో కొలువై ఉన్న శివునికి అంకితం చేయబడిన ఒక హిందూ దేవాలయం. ఇక్కడ శివుడు అభిరామేశ్వరర్గా పూజలందుకుంటాడు. లింగ రూపంలో కొలువై ఉన్నాడు. ఆయన భార్య పార్వతి మనోన్మణి అమ్మన్గా పూజలందుకుంటుంది. ఈ ఆలయం చెన్నై - విల్లుపురం జాతీయ రహదారిపై ఉంది.
ఈ ఆలయ సముదాయం రెండు ఎకరాల విస్తీర్ణంలో ఉంది. దాని పుణ్యక్షేత్రాలన్నీ ఏక కేంద్రీయ దీర్ఘచతురస్రాకార గోడలతో చుట్టబడి ఉన్నాయి. ఈ ఆలయంలో అనేక పుణ్యక్షేత్రాలు ఉన్నాయి, వీటిలో అబిరామేశ్వర దేవాలయాలు అత్యంత ప్రముఖమైనవి. ప్రాంగణానికి ఎదురుగా అభిరామేశ్వర భార్య ముత్తమ్మన్ మందిరం ఉంది. తెలుగు ఈ సముదాయాన్ని చోళులు నిర్మించారని చెబుతారు ప్రధాన ఆలయాన్ని విజయనగర సామ్రాజ్యానికి చెందిన అచ్యుతదేవరాయ నిర్మించారు.
హిందూ పురాణం ప్రకారం, సృష్టి ప్రారంభంలో ఆవులకు కొమ్ములు లేవు. అరణ్య జంతువులు వాటిని బాధించేవి. ఆవులు శివుని ప్రార్థించాయి. శివుడు వారి భక్తితో సంతోషించి ఆవులకు కొమ్ములు ఇచ్చాడు. ఆవులను తమిళంలో "ఆ" అంటారు కాబట్టి, ఈ ప్రదేశం తిరుఆమతూర్ అని ప్రసిద్ధి చెందింది. ఈ ఆలయంలోని శివలింగంలో ఆవుల పాదముద్రలు కనిపిస్తాయి. మరో కథ ప్రకారం, అంబాళ్ (పార్వతి) విగ్రహానికి పాము తోక ఉన్నట్లు చూపిస్తారు.
శివుడు, పార్వతి ఆలయాల మధ్య గోడలో ఒక చిన్న రంధ్రం ఉంది. ఆ రంధ్రం ద్వారా వారు ఒకరినొకరు దర్శించుకుంటారని నమ్మకం.
ఈ ఆలయపు ప్రాచీన నిర్మాణం చాలా పురాతనమైనది. తరువాత కాలంలో దీనిని పల్లవులు, చోళులు అభివృద్ధి చేశారు. ప్రధాన ఆలయాన్ని విజయనగర రాజవంశానికి చెందిన అచ్చుదేవరాయ నిర్మించాడు.
ఇక్కడ మొదటి రాజరాజ చోళుడు, కులోత్తుంగ చోళుడు--1, మూడవ రాజేంద్ర చోళుడు కాలానికి చెందిన శాసనాలు ఉన్నాయి. రాజనారాయణ సాంబువరాయ అనే చోళుల అధిపతి ఈ ఆలయాన్ని మరమ్మత్తులు చేయించి పూజలను పునరుద్ధరించి ఉత్సవాలను తెలియ ప్రారంభించాడు. ఆయన చేసిన సేవలు శిలా శాసనాల్లో ఆయన రచించిన మధుర విజయం అనే సంస్కృత గ్రంథంలో నమోదు చేయబడ్డాయి.

వాస్తుశిల్పం

విలుప్పురం-చెన్నై రహదారిపై తిరువమతూర్ అనే గ్రామంలో అభిరామేశ్వర ఆలయం ఉంది. ఈ ఆలయంలో తూర్పు వైపు ఏడు అంచెల ప్రవేశ గోపురం ఉంది. ఆలయంలోని అన్ని పుణ్యక్షేత్రాలు దీర్ఘచతురస్రాకార రాతి గోడలతో చుట్టబడి ఉన్నాయి. రాజగోపురం వెలుపల కేంద్ర మందిరానికి ఎదురుగా ఉన్న ఒక మందిరంలో ముత్తంబై మందిరం ఉంది. ముత్తంబై మందిరంలో మూడు అంచెల ప్రవేశ గోపురం కూడా ఉంది. అభిరామేశ్వరర్ ఉన్న కేంద్ర మందిరాన్ని స్తంభాల మందిరాల ద్వారా చేరుకోవచ్చు. ఈ మందిరంలో అభిరామేశ్వర విగ్రహం లింగం రూపంలో ఉంది. మహామండపం, అర్ధమండపం ద్వారా కేంద్ర మందిరానికి చేరుకోవచ్చు. తమిళనాడులోని ఇతర శివాలయాల మాదిరిగానే, వినాయక, మురుగన్, నవగ్రహ, చందేకేశ్వర, దుర్గా ఆలయాలు ప్రధాన మందిరం ఆవరణ చుట్టూ ఉన్నాయి.



ఇది ప్రారంభ మధ్యయుగ కాలంలో తమిళ శైవ నాయనార్లలో ఒకరైన అప్పార్ తిరువెన్నైనల్లూరు నుండి తిరుక్కోవిలూర్, పెన్నడం వరకు చేసిన పర్యటనల పరంపరలో ఈ ఆలయాన్ని సందర్శించారని చెబుతారు. రామాయణంలోని అవతారం, కథానాయకుడైన రాముడు, ఈ ప్రదేశంలో శివుడిని పూజించి రావణుడిని చంపిన పాపం నుండి విముక్తి పొందారని నమ్ముతారు.
ఇక్కడి శివలింగం స్వయంభువుగా వెలసిందని ప్రతీతి. ముత్తమ్మ విగ్రహాన్ని, ఆది శంకరాచార్యులు ప్రతిష్ఠించారని నమ్ముతారు.
రాక్షసుడైన సూరపద్మడిని సంహరించడానికి మురుగన్ పార్వతీ నుండి తన ఆయుధమైన వేల్ ను పొందిన ప్రదేశం కూడా ఇదేనని నమ్ముతారు. ఇక్కడ ప్రధాన దైవాన్ని వివిధ దేవతలు పూజించారు అరుణగిరి మాధర్ ఈ ఆలయంలోని మురుగన్ పై కీర్తనలు ఆలపించాడు.



" కావ్యసుధ "
'వాఙ్మయ భూషణ'
" సాహితీ శిరోమణి "
" కవన సాగర "
'ఆధ్యాత్మిక సాహిత్య సామ్రాట్'
" ఆధ్యాత్మిక సాహితీ వ్యాస భూషణ్ "
9247313488 :
హయత్ నగర్ :
హైదరాబాదు



# చిట్టి ప్రేమలో పడింది.. అతడితో డేటింగ్

జాతిరత్నాలు సినిమాలో చిట్టి పాత్రతో అదరగొట్టిన ఫరియా అబ్దుల్లా, తన ప్రేమకథ బయటపెట్టింది. ప్రస్తుతం ఆమె ఓ కొరియోగ్రాఫర్ తో డేటింగ్ చేస్తోంది. అతడు ముస్లిం కాదని, హిందూ అబ్బాయి అనే విషయాన్ని కూడా ఆమె బయటపెట్టింది.
ఫరియా అబ్దుల్లాను మంచి డాన్సర్ గా, సింగర్ గా మార్చడంలో అతడు ఎంతో ప్రోత్సాహం అందించాడట. అందుకే అతడంటే తనకు చాలా ఇష్టం అంటోంది ఫరియా. తమది కేవలం లవ్ ఎఫైర్ మాత్రమే కాదని, తమది బలమైన భాగస్వామ్యమని అంటోంది ఫరియా.
ఆ కొరియోగ్రాఫర్ పేరును మాత్రం ఆమె బయటపెట్టలేదు. తనలోని మార్పులకు అతడే కారణం అంటోంది ఫరియా అబ్దుల్లా. సరైన టైమ్ వచ్చినప్పుడు మరిన్ని వివరాలు వెల్లడిస్తానని చెబుతోంది.
నిజానికి తను సింగిల్ కాదనే విషయాన్ని గతేడాదే ఫరియా వెల్లడించింది. దానికి కొనసాగింపుగా ఆమె ఇప్పుడు మరికొన్ని వివరాలు బయటపెట్టింది. ఆ కొరియోగ్రాఫర్ ఎవరనే చర్చ ఇప్పుడు ఇండస్ట్రీలో జోరుగా సాగుతోంది. ఫరియా ఇనస్టాగ్రామ్ పాత వీడియోలు చూస్తే అదెవరనేది ఈజీగా అర్థమైపోతుంది.
గతంలో ప్రేమ-పెళ్లికి సంబంధించి తన ఫాంటసీలు బయటపెట్టింది ఫరియా. ప్రేమించడానికి యంగ్ పవన్ కల్యాణ్, పెళ్లికి యంగ్ నాగార్జున కావాలంటూ స్టేట్ మెంట్ ఇచ్చింది. బహుశా, ఆ ఇద్దర్నీ ఇప్పుడీ కొరియోగ్రాఫర్ లో ఆమె చూసిందేమో.

# అయ్యో, ఇలా దొరికిపోయావేంటి వేణు!

బలగం అనే ఒకేఒక్క సినిమాతో అందర్నీ ఆకర్షించాడు వేణు యెల్దండి. కమెడియన్ నుంచి దర్శకుడిగా మారి, తొలి సినిమాతోనే తిరుగులేని ఇమేజ్ తెచ్చుకున్నాడు. ప్రస్తుతం తన రెండో సినిమా ఎల్లమ్మ పనిలో బిజీగా ఉన్నాడు. ఇలా ఓవైపు తనపనిలో తాను ఉండగా మరోవైపు సోషల్ మీడియాలో అతడిపై ట్రోలింగ్ మొదలైంది.
తెలంగాణలోని ఓ ఆలయ ప్రాంగణం నుంచి కొన్ని ఫొటోలు షేర్ చేశాడు వేణు. అందులో అతడు షూ ధరించి ఉన్నాడు. అవి చూసిన నెటిజన్లు, అతడిపై విరుచుకుపడుతున్నారు. హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా, అలా గుడి ప్రాంగణంలో షూ ధరించడం తప్పంటూ ట్రోలింగ్ అందుకున్నారు.
ట్రోలింగ్ మొదలైన వెంటనే కొంతమంది సినీ జనాలు వేణుకు మద్దతుగా నిలిచారు. షూటింగ్? టైమ్?లో కరెంట్ వైర్లన్నీ నేలపై పడి ఉంటాయని, సేఫ్టీ కోసం అలా షూ ధరించడం కామన్ అంటూ సమర్థించారు. అలా సేఫ్టీ కోసం ధరించినప్పుడు, ఆ ఫొటోల్ని సోషల్ మీడియాలో పెట్టకూడదని మరికొందరు రివర్స్?లో అందుకున్నారు. కాస్త పేరొచ్చిన తర్వాత ఫాలోయింగ్ ఎంత ఉంటుందో, ట్రోలింగ్ కూడా అదే స్థాయిలో ఉంటుంది. ఏ చిన్న తప్పు దొరికినా చెడుగుడు ఆడుకుంటుంది సోషల్ మీడియా. వేణుకు ఆ సెగ ఇప్పుడు తెలిసొచ్చింది.
ఈ వివాదాలు, ట్రోలింగ్?తో సంబంధం లేకుండా తన పని తాను



చేసుకుపోతున్నాడు వేణు. దేవిశ్రీ ప్రసాద్ హీరోగా ఎల్లమ్మ సినిమా షూటింగ్ ప్రస్తుతం కొనసాగుతోంది. ఇప్పటికే డిలే అయిన ఈ ప్రాజెక్టును వీలైనంత త్వరగా పూర్తిచేసే పనిలో ఉన్నాడు వేణు. దిల్ రాజు నిర్మాత.

# రక్తదాన శిబిరంలో ఆదిత్య విద్యార్థులు



నవతరం-టెక్కలి

టెక్కలి అభయం యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో రిపబ్లిక్ డే సందర్భంగా టెక్కలి జిల్లా హాస్పిటల్ లో నిర్వహిస్తున్న రక్తదాన శిబిరాలలో కె కొత్తూరు లో ఉన్న ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ వి.వి నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ ఏ.ఎస్ శ్రీనివాసరావుల సౌజన్యంతో 15 మంది విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారని అభయం యువజన సేవా సంఘం అధ్యక్షులు దేవాది శ్రీనివాస రావు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛందంగా రక్తదానం చేయడానికి వచ్చిన విద్యార్థులందరికీ ధన్యవాదాలు తెలియజేస్తూ.. జ్ఞాపిక తో సత్కరించి పోషకాహార కిట్ అందజేశారు. ఈ కార్యక్రమం లో అభయం సేవా సంఘం అధ్యక్షులు దేవాది శ్రీనివాస రావు, సంఘ సభ్యులు ధర్మవరపు పూర్ణాచారి, సాహుకారి రాజేష్,యన్ సింహాచలం, వకుళాభరణం ఈశ్వర రావు ఐతం డీన్ డా.శాంతికుమార్, యన్.సి.సి ట్రైనర్ యన్ భుజంగరావు, యన్.ఎస్.ఎస్ పీఓ మారుతి ప్రసాద్ పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ అందరిబాధ్యత

## - శాసనసభ్యులు గొండు. శంకర్

## - రథసప్తమి వేడుకలలో మొక్కలు నాటిన కలెక్టర్



నవతరం-శ్రీకాకుళం

పర్యావరణ పరిరక్షణ అందరిబాధ్యతని, నియోజకవర్గ శాసనసభ్యులు గొండు. శంకర్ అన్నారు. స్థానిక 80 అడుగుల కూడలిలో రథసప్తమి ఉత్సవాలలో భాగముగా యోగా, సూర్య నమస్కారాలు కార్యక్రమం అనంతరం లయన్స్ క్లబ్ జిల్లా ఎన్విరాన్మెంట్ చైర్మన్ లయన్ పొన్నాడ. రవి కుమార్ ఆధ్వర్యంలో, కలక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జెసి ఇతర అధికారులతో కలసి గొండు శంకర్ మొక్కలను నాటారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పర్యావరణంపై బాధ్యత తీసుకోవాలని, ప్రభుత్వాల పాత్ర కన్నా ప్రజల భాగస్వామ్యం ముఖ్యమని, ఇంటి నుంచి బయలుదేరే ముందే గుడ్డ సంచులను పట్టుకోవడం రానున్న ఆరోగ్యకర సమాజానికి నాందని, మార్పు మనతోనే మొదలుపెట్టాలని పిలుపునిచ్చారు. లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ పర్యావరణంపై ప్రత్యేక దృష్టిసారించటం ఆనందదాయకమన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ రానున్న రధసప్తమి రాష్ట్రపండుగ, ఆరాధ్యదైవం అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి వారి వేడుకలు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని, మూడు రోజులు అంగరంగవైభవంగా నిర్వహిస్తున్నారని, స్వామి వారి దర్శనానికి వివిధ రాష్ట్రాల నుండి లక్షలాది భక్తులు తరలివస్తారని, భక్తులు వీలైనంతవరకు ప్లాస్టిక్ సంచులకు బదులు, గుడ్డ సంచులను, స్టీల్ వాటర్ బాటిల్స్ వినియోగించాలన్నారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, పొన్నాడ రవికుమార్ మాట్లాడుతూ రాష్ట్ర పండుగలో భాగంగా ప్లాస్టిక్ సంచులతో పర్యావరణ కాలుష్యం వాటిల్లటమే కాకుండా, కాన్సర్ తోపాటు అనేక రోగాలకు కారకులవుతామన్నారు. అలాగే ఒక్క సారి వాడి, బయటకు పారవేసే వాటిని వాడాలని, వాటిని రహదారులపై పారవేయకుండా రహదారికి ఇరువైపులా మున్సిపల్ అధికారులు ఏర్పాటు చేసిన చెత్తకుండీలో వేసి, పర్యావరణ పరిరక్షణతోపాటు, మున్సిపల్ దిగువ స్థాయి ఉద్యోగులకు సహకరించిన వారవుతారని, ఇతర రాష్ట్రాల నుండి వచ్చే భక్తులకు శ్రీకాకుళం సుందరనగరంలా కనపడాలన్నారు.
ఈ కార్యక్రమంలో ఆర్డీవో సాయి ప్రత్యూష, జిల్లా ఆయుష్ అధికారి జగదీష్, సోషల్ వెల్ఫేర్ డీడీ మధుసూదనరావు, మాజీ మున్సిపల్ చైర్?పర్సన్ పైడిశెట్టి జయంతి, డిపిఓ భారతి సౌజన్య, టీడీపీ సీనియర్ నాయకులు ఉంగటి రమణ, లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ మెంటార్ నటుకుల మోహన్ ఉపాధ్యక్షులు ఉర్లం. శివతేజ, సభ్యులు రమ్య, చౌదరి. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# వెలుగులరేడు వేడుకకు సిద్ధం

## కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు



నవతరం-శ్రీకాకుళం

రాష్ట్రపండుగ హోదాలో జరుగుతున్న శ్రీకాకుళం జిల్లా అరసవల్లి రథ సప్తమి వేడుకలు తుది ఘట్టానికి చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో ఆదివారం నాడు సూర్యజయంతిని పురస్కరించుకుని దర్శనానికి విచ్చేస్తున్న అశేష భక్తజనం.. ప్రశాంతంగా దర్శనం చేసుకుని వెళ్లాలని కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కోరారు. రాష్ట్ర పండుగ హోదాలో జరుగుతున్న ఈ వేడుకకు అన్ని ఏర్పాట్లను గడచిన నెల రోజులుగా వివిధ స్థాయిలలో సమీక్ష చేసి.. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వహిస్తున్నామని.. ఆఖరి రోజు దర్శనాల సమయంలో కూడా ప్రశాంతమైన దర్శనం జరిగేలా ఏర్పాట్లు చేసినట్లు స్పష్టం చేశారు. ఉచిత దర్శనంతో పాటు వివిధ కేటగిరీలలో దర్శన ఏర్పాట్లు చేశామని.. గతంలో మాదిరి కాకుండా టైం స్లాట్ విధానాన్ని ఈ ఏట అవలంభిస్తున్న నేపథ్యంలో.. భక్తులందరూ సమయపాలన పాటించి.. పోలీసులకు, అధికారులకు సహకరిస్తూ దర్శనం చేసుకోవాలని కోరారు. గడచిన కొద్ది రోజులుగా శ్రీకాకుళం నగరంలో జరిగిన విశేష సాంస్కృతిక, వినోద, క్రీడా కార్యక్రమాలు ఆహుతులను ఎంతగానో అలరించాయని అన్నారు. అరసవల్లి ఆదిత్యునికి అత్యంత ప్రీతిపాత్రమైన ఆదివారం రోజున ఈ వేడుక జరగనుండటంతో భక్తులు పెద్ద ఎత్తున వస్తారని అంచనా వేస్తున్నామని.. అందుకు తగ్గ ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.

# సిక్కోలులో యోగ సూర్యోదయం..

## పదివేల మందితో 'మెగా' నమస్కారాలు

నవతరం-శ్రీకాకుళం

సిక్కోలు రథసప్తమి ఉత్సవాల వేళ 80 అడుగుల రోడ్డు యోగ వేదికగా మారింది. శుక్రవారం ఉదయం భానుడి లేత కిరణాల సాక్షిగా నిర్వహించిన 'మెగా సూర్య నమస్కారాలు' కార్యక్రమం కనువిందు చేసింది. దాదాపు పదివేల మంది విద్యార్థులు, యోగ సాధకులు ఏకకాలంలో సూర్య నమస్కారాలు చేస్తూ నగరాన్ని ఆధ్యాత్మిక, ఆరోగ్య చైతన్యంతో నింపేశారు.
జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే గొండు శంకర్ జ్యోతి ప్రజ్వలన చేసి ఈ బృహత్తర కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గొండు శంకర్ స్వయంగా స్టేజ్ పై యోగ ముద్రలను ప్రదర్శిస్తూ అందరినీ ఉత్సాహపరిచారు. యోగ గురువుల పర్యవేక్షణలో వేల సంఖ్యలో తరలివచ్చిన జనసందోహం క్రమశిక్షణతో సూర్య నమస్కారాలు నిర్వహించడం విశేషం.
ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఆర్డీవో సాయి ప్రత్యూష, డీఎస్పీ వివేకానంద, జిల్లా ఆయుష్ అధికారి జగదీష్, అరసవల్లి ఈఓ ప్రసాదరావు, సోషల్ వెల్ఫేర్ డీడీ మధుసూదనరావు, మాజీ మున్సిపల్ చైర్పర్సన్ పైడిశెట్టి జయంతి, మంత్రి వెంకటస్వామి, డిపిఓ



భారతి సౌజన్య ఆసనాలు వేశారు. షిరిడీ సాయి యోగ కేంద్రం (రసజ్ఞ), ఆసీస్, దినేష్ బృందం యోగ గీతాలతో కార్యక్రమాన్ని ముందుకు నడిపించారు. రామారావు, చిన్నబాబు (పతంజలి), ఆర్ట్ ఆఫ్ లివింగ్ నుండి కల్పన, ఆదినారాయణ, తంగి స్వాతి, గాయత్రి, అర్చన, పాండ్రంకి మురళీకృష్ణ, పి. వాసంతి, శ్రీనివాస శర్మ, ఓం శాంతి జయలక్ష్మి తదితర యోగ శిక్షకులు విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. వివిధ విద్యాసంస్థలు, యోగ శిక్షణ కేంద్రాల ప్రతినిధులు, పతంజలి యోగ సెంటర్ విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు.

# తండ్రికి తగ్గ తనయుడు

- ఎమ్మెల్యే ఎంజీఆర్ ఆధ్వర్యంలో ఘనంగా నారా లోకేష్ బాబు జన్మదిన వేడుకలు...
- ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నుంచి అమ్మవారి గుడి వరకు వేలాదిమంది బైకులతో వెళ్లి లోకేష్ బాబు పేరు మీద ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యేతో పాటు నాయకులు..
- నీలమణిదుర్గ గుడిలో 1001 కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే
- నీలమణి దుర్గ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో మొక్కలు నాటిన ఎమ్మెల్యే
- హాస్పిటల్ లో రోగులకు రొట్టెలు,పండ్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఎంజీఆర్
- పేదలకు దుప్పట్లు పంపిణీ చేసిన శాసనసభ్యులు మామిడి గోవిందరావు
- 10వ తరగతి చదువుకున్న విద్యార్థిని విద్యార్థులకు పరీక్ష కిట్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే
- సుమారు 1500 వందల మంది ప్రజలుకు అన్నదాన కార్యక్రమం నిర్వహించిన ఎమ్మెల్యే ఎంజీఆర్

నవతరం- పాతపట్నం

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఐటి, విద్యాశాఖ మాత్యులు నారా లోకేష్ బాబు జన్మదిన వేడుకలను పాతపట్నం నియోజకవర్గం శాసనసభ్యులు వారి కార్యాలయంలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు గారు ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి, వేడుకలలో భాగంగా ఎమ్మెల్యే కార్యాలయం నుంచి నీలమణి దుర్గ అమ్మవారి గుడి వరకు వేలాదిమంది ప్రజలు చేరుకుని లోకేష్ బాబు పేరు మీద ప్రత్యేక పూజలు నిర్వహించడం తోపాటు 1001 కొబ్బరికాయలు కొట్టడం జరిగింది. ఆలయ ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమం తో పాటు వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. అలాగే స్థానిక సి హెచ్ సీ లో రోగులకు బ్రెడ్లు,పండ్లు పంపిణీ చేశారు అలాగే 10వ తరగతి చదువుకున్న విద్యార్థిని విద్యార్థులకు పరీక్ష కిట్లు పంపిణీ చేశారు. ఈ జన్మదిన వేడుకలకు ఐదు మండలాల ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు,అభిమానులు తదితరులు భారీగా పాల్గొన్నారు.





Printed by **SIRIGIRI VARADARAJU**, and published by **SIRIGIRI VARADARAJU**, on behalf of **SIRIGIRI VARADARAJU**, and printed at : Kranthi Publications, D.No.2-504/1, **Aditya Nagar** Colony, **Arasavilli,** Srikakulam,Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, **Published at :** Kranthi Publications, D.No.2-504/1, Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, Editor : **SIRIGIRI VARADARAJU**, Email: navataramraju@gmail.com, **Cell : 9959007255, 8340844777**